క్లుప్తంగా

పీఏసీఎస్ చైర్మన్‌గా తీళ్ల శివున్నాయుడు



నియామక పత్రాలు అందుకుంటున్న శివున్నాయుడు

పార్వతీపురంటౌన్: మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా వెంకంపేటకు చెందిన తీళ్ల శివున్నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన జి.దామోదర్ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో పదవికి రాజీనామా చేశారు.

ముమ్మరంగా సీఆర్‌పీఎఫ్ బలగాల తనిఖీలు



మక్కువ ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

మక్కువ: మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు రెండు రోజులుగా తనిఖీలు చేపడుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో మావోయిస్టులు వ్యూహాత్మక దాడులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తమయ్యాయి. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలైన మక్కువ, దుగ్గేరులలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏజెన్సీ నుంచి మండల కేంద్రానికి రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద నాకాబందీ నిర్వహిస్తున్నారు. మక్కువ నుంచి దుగ్గేరు, సాలూరు వెళ్లే రహదారులపై రెండు రోజులుగా ఆర్‌ఓపీ (రోడ్డు ఓపెనింగ్‌పార్టీ) బలగాలు తనిఖీలు చేపడుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా సీఆర్‌పీఎఫ్ బలగాలు అప్రమత్తమయ్యాయి.


కుక్కల దాడిలో ఆవు దూడకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన దూడ

పార్వతీపురంటౌన్: మండలంలోని పుట్టూరు గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో జెర్సీ ఆవుదూడకు గాయాలయ్యాయి. ఈ మేరకు పశువైద్యాధికారి భోగి చక్రధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వి.రాజగోపాలరావు పెంచుకుంటున్న జెర్సీ దూడను ఏడు కుక్కలు కుట్లు సైతం వేయలేని విధంగా గాయపరిచాయి. కుక్కలను అదుపుచేయడానికి అధికారులు తగు చర్యలు తీసుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేయాలి



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజావసరాలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టి వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా చూసుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం లచ్చయ్యపేటలో జరుగుతున్న పనులను, వేతనదారుల మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎండబారిన పడకుండా ఉదయాన్నే పనుల్లోకి వచ్చేలా వేతనదారులకు క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించాలని సూచించారు. పనిచేయాల్సిన చోట మార్కింగ్ విధానం అవలంబించి, ఇచ్చిన మార్కింగ్‌లోనే నిర్దేశించిన గడువులోగా పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకునే విధంగా తెలియ జేయాలన్నారు. వేతనం గిట్టుబాటయ్యే విధంగా సాంకేతిక సహాయకులు చూడాలని స్పష్టం చేశారు. పని చేసినచోట టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని, నీడ నిచ్చే చెట్లున్నచోట పనులు జరిగేలా చూడాలని, తాగునీరు విధిగా చల్లని నీడలో ఉండేలా చూడాలని సూచించారు.

బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతి

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం రహదారిలోని బస్ షెల్టర్లో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం గుర్తించారు. తొలిత ఆచూకీ తెలియని మృతదేహంగా భావించిన పోలీసులు మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్య వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలు పొందుతున్న వారి ఆరోగ్య వివరాలు వైద్యసిబ్బంది పక్కాగా నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన నడిమిగదబవలసలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం సందర్శించి ఓపీ వివరాలు, పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, రికార్డులను పరిశీలించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, పరీక్షల కిట్లు పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్న వారి జాబితా ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామంలోని రోగులు వైద్య సేవలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి చెప్పారు.

ఆరోగ్య వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో సందర్శించి డ్రై డే కార్యక్రమాన్ని వైద్యసిబ్బందితో నిర్వహించారు. గృహ సందర్శనలో ఓ వృద్ధురాలితో మాట్లాడి ఆమె ఆరోగ్య స్థితి పరిశీలించి అవసరమైన మందులు అందజేశారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ సాహితి, సూపర్ వైజర్స్ జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉమ్మడి విజయనగరం జిల్లా పూర్వపు ఓఎస్డీ విక్రాంత్ పాటిల్ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రశాంతతకు మారుపేరుగా నిలుస్తుందని, అటువంటి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో తనదైన శైలిలో ముందుకు సాగి తన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎస్పీని ఎమ్మెల్యే జోగారావు కోరారు.

పార్వతీపురానికి ప్రథమ స్థానం

- ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో పార్వతీపురం నియోజకవర్గం నిలిచిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ప్రారంభించిన 'జగనన్నే మా భవిష్యత్' ప్రచార కార్యక్రమం రెండు వారాలు పూర్తి చేసుకుందన్నారు. పార్టీ అధిష్ఠానం అందించిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహణలో పార్వతీపురం నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతి గ్రామం, వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్లి నూటికి నూరుశాతం విజయవంతం చేసిన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి, నాయకుడు, కార్యకర్త, సచివాలయ కన్వీనర్, గృహసారథి, వలంటీర్, అభిమానులందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి..



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా, మార్పులు చేసినా యజమానులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకరరావుకు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. పట్టణంలోని రామా కాలనీకి చెందిన పలువురు నాయకులు, ప్రజలు ఉప ముఖ్యమంత్రిని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 23వ వార్డు పరిధిలో గల త్రిశూల్‌రమణ పాఠశాల భవనాన్ని కల్యాణమంటపంగా మారుస్తున్నారని, దీని వల్ల స్థానికులు ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. కల్యాణమంటపంగా మార్పు చేయడంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. వెంటనే మంత్రి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, దయ, దాతృత్వానికి రంజాన్, ముస్లిం మతం ప్రతీక అన్నారు. అన్ని మతాల సౌభ్రాతృత్వంతో సుఖంగా జీవనం సాగిస్తున్నామని ఆయన చెప్పారు. అన్ని మతాలు శాంతిని ప్రబోధించడంతో సమైక్యత ఉందని చెప్పారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ షఫీ, షేక్ జలాల్, సయ్యద్ ఇబ్రహీం, ఎం.డి ఫారుక్ ఖాన్, షేక్ అబ్బు, మైనారిటీ సంక్షేమశాఖ పర్యవేక్షకులు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

25న స్క్రాప్ సామగ్రి వేలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 5 మున్సిపల్ రిజర్వాయర్ల వద్ద గల ఇనుప సామగ్రి స్క్రాప్ జీఐ పైపులు, ప్లాస్టిక్ పైపులు, బోర్ మెటీరియల్స్, ఎలక్ట్రికల్ మెటీరియల్ స్క్రాప్, పాత న్యూస్ పేపర్లు అమ్మే నిమిత్తం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 25వ తేదీన ఉదయం 11గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నామన్నారు.ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు.

ఈదురు గాలులతో బెంబేలు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా శుక్రవారం వేకువజామున వీచిన ఈదురుగాలులతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఈదురు గాలులకు వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం 6.45 గంటల నుంచి 9 గంటల వరకు గాలులు వీయడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

తాగునీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు



బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ సీహెచ్ కృష్ణ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో తాగునీటి ఎద్దడి నివారణకు సత్వరచర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పంచాయతీ బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికార సిబ్బంది చేస్తున్న మరమ్మతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి రావడం వల్ల ప్రజలకు అవసరమైన నీరు సరఫరా చేయడానికి మూలకు చేరిన బోర్లకు మరమ్మతులు చేపట్టి వారి అవసరాలకు అనుగుణంగా తానీరు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకున్న చొరవతో మంజూరైన లక్షలాది రూపాయలతో నిర్మిస్తున్న మంచినీటి పథానికి సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. ట్యాంక్ పనులు పూర్తి చేసి ఇంటింటి కుళాయి పథకం ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో బోరు మెకానిక్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి నిర్వాసితులకు ఇళ్లపట్టాల పంపిణీ



లాటరీ విధానంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: తోటపల్లి నిర్వాసితులకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం 28మందికి అడ్డాపుశీల పంచాయతీ పరిధిలో ఇళ్ల పట్టాలను లాటరీ విధానంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అర్హులెవరైనా మిగిలి ఉంటే వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్.కృష్ణ, ఎంపీపీ మజ్జి శేఖర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నిరసన

- సస్పెన్షన్ విధించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

పార్వతీపురం: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ సస్పెన్షన్ విధించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదనే కారణంగా విద్యాశాఖలో పనిచేస్తున్న డీఈఓ, కేజీబీవీ ఎస్‌ఓ, అసిస్టెంట్ జీసీడీఓ, ఎంఈఓలపై సస్పెన్షన్ విధించడం సరికాదన్నారు. పుస్తకాలను పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోతే ఎలా విద్యార్థులకు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. వీరఘట్టం కేజీబీవీకి శ్రీకాకుళం జిల్లానుంచి పాఠ్యపుస్తకాల కోసం ప్రతిపాదనలు చేసి పంపిణీ చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పంపిణీ అయిన పుస్తకాలకు పార్వతీపురం మన్యం జిల్లా అధికారులను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు జి.మురళీమోహన్, బాలకృష్ణతో పాటు పలువురు కోరారు.

సస్పెన్షన్‌ను ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 8వ తరగతి విద్యార్థులకు గణితం పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదనే కారణంగా జిల్లా,మండల విద్యాశాఖాధికారులను,కేజీబీవీ ఎస్‌ఓ, జీసీడీఓలను బాధ్యులను చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సస్పెన్షన్ విధించడాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి.ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

'జగనన్నే మా భవిష్యత్'లో టిడ్కో చైర్మన్



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: పీటిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుపై జగనన్నే మా భవిష్యత్తు పేరుతో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డ్ వలంటీర్లుతో కలిసి నిర్వహించే కార్యక్రమం మెగా ఉద్యమానికి నాంది పలికిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషి అందరికీ తెలియజేసి రాబోయే రోజుల్లో కూడా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి ఉండాలనే ఆకాంక్షతో పెద్ద ఎత్తున ప్రజలు 8296082960 మొబైల్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారని, దీనిని చూసి కొంత మంది ప్రతిపక్ష నేతలు ఓర్వలేకపోతున్నారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యకు ప్రభుత్వ కళాశాలలో చేరాలి



విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని కోరుతూ గుచ్చిమిలో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు

సీతానగరం: ఇంటర్మీడియట్ బోధనకు, విద్యార్థుల రాకపోకలకు, మౌలిక వసతులున్న మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదోతరగతి ఉత్తీర్ణులు కానున్న విద్యార్థులు చేరాలని కోరుతూ కాలేజీ అధ్యాపకులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం అధ్యాపక బృందం జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖఅధికారులు, ప్రిన్సిపాల్ బి.రేణుక ఆధ్వర్యంలో జోగింపేట, అప్పయ్యపేట, కాశీపేట, అంటిపేట గ్రామాల్లో నాలుగు గ్రూపులుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు టి.రవికుమార్, నవీన్‌కుమార్‌లు ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదివి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులు, సీనియర్ అధ్యాపకులతో విద్యా బోధన అందనున్నట్లు తెలియజేశారు. కాలేజీలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, సీఈటీ, ఎంఅండ్ ఏటీ, ఓఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) కోర్సులలో జాయిన్ అవ్వాలని, ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీని బలోపేతం చేయాలని కోరారు. కాలేజీలో ల్యాబ్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అచ్చంనాయుడు, అరుణ్ కుమారి, రామకృష్ణ, కిశోర్, ఆర్‌వీ ప్రసాద్ రావు, ఎ.రామారావు, రమేష్, వినోద్, శ్రీధర్, గంగరాజు, వసంతరావు, మోహన్‌రావు, అమ్మాజీ, ఇందిర, మయూరి పాల్గొన్నారు.

గౌరీపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం



గౌరీపురంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

బలిజిపేట: మండలకేంద్రం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గౌరీపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించి గ్రామంలోని 65మందికి, శిబిరం వద్దకు రాలేనివారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటివద్దకే వైద్యులు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అన్ని రకాల రోగాలకు వైద్యసేవలు అందుతాయని చెప్పారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లి చిన్నారులను పరిశీలించారు. కదలలేని రోగులకు ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు అవసరమైన సూచనలు అందించారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, డీఈఓ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా అమలుకు నిబంధనలు పాటించాలి

- ఏఓ ఎస్ అవినాష్



మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: పంటల సాగుకు రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పొందడానికి రైతులు నిబంధనలు పాటించాలని ఏఓ ఎస్ అవినాష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎంఏఓ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయ సహాయకులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సంబంధించి జీఎస్టీ కేన్సిల్ చేసుకున్న రైతులు అర్హత కలిగి ఉండాలంటే కేన్సిల్ చేసుకున్న తరువాత ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రైతు భరోసాకు అర్హత పొందుతారు. గత సంవత్సరంలో ఆదాయ పన్ను (ఇన్‌కమ్ ట్యాక్స్) కట్టని రైతులు రైతు భరోసాకు అర్హత పొందడానికి వారు ఆదాయ పన్ను చెల్లించలేదని సీఏ ద్వారా ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. డెత్‌కు సంబంధించి నామినీ పెట్టడానికి ఎంఏఓ లాగిన్‌లో స్టాప్ పేమెంట్ చేయాలని తరువాత గ్రీవెన్స్ మాడ్యూల్‌లో నామినీ అప్‌డేట్ చేయాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తకు భార్య లేదా భార్యకు భర్తను మాత్రమే నామినీ పెడతారని స్పష్టం చేశారు. పిల్లలను నామినీ చేయకూడదని, పిల్లలకు చేయాలంటే తప్పనిసరిగా మ్యుటేషన్ జరిగి భూమివారి పేరున వెబ్‌ల్యాండ్‌లో ఉండాలని స్పష్టం చేశారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కిసాన్ డ్రోన్ యంత్ర సేవ కేంద్రం(కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ –సీహెచ్‌సీ)– ఈ గ్రూప్‌లు రైతు భరోసా కేంద్రాలలో ఆసక్తి కలిగిన రైతులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆ గ్రూప్‌లో డ్రోన్ ఎగుర వేసేందుకు శిక్షణ తీసుకున్న సభ్యులు ఉండాలని, డ్రోన్ పైలట్‌గా గ్రామీణ నిరుద్యోగ యువత నుంచి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికకు అర్హతలు

1. బీఎస్సీ అగ్రిల్చర్ /బీఎస్సీ అగ్రికల్చర్ ఇంజినీరింగ్
2. డిప్లమో అగ్రికల్చర్/డిప్లమో అగ్రికల్చర్ ఇంజినీరింగ్
3. ఇంజినీరింగ్ పట్టభద్రులు/డిప్లమోఇ ఇన్ ఇంజినీరింగ్
4. అభ్యర్థుల్లో ఎటువంటి సమస్యలున్నా మండల వ్యవసాయాధికారిని పనిదినాల్లో సంప్రదించాలి